# జక్కికి (భజన) నృత్యం

గ్రామాలలో సంక్రాంతి పండుగ నెలరోజులనగా ధనుర్మాసంలో గొబ్బెమ్మలు చేసుకొని ఇంటి ఇంటికీ నలుగురు లేక ఐదుగురు ముత్తయిదువులు గొబ్బెమ్మలను చేతిలో పెట్టుకొని పాడుకుంటూ వీధివెంబడి నెల రోజులు ఊరంతా తిరుగుతూ సంక్రాంతి మూడు రోజుల పండుగ అయిన తర్వాత, ఆడవాళ్లంతా చప్పెట్లుకొట్టుకొంటూ, భజనచేస్తూ గ్రామ తగాదాలు విడనాడి అందరూ కలసి సంబరం చేసుకుంటూ గొబ్బెమ్మలను ఊరేగిస్తూ తీసికొనివెళ్లి నిండు బావిలో వేస్తారు. మన పూర్వీకులు గ్రామంలోని కక్షలు సమసిపోవుటకు అందరూ సృహృద్భావంతో కలసిమెలసి ఉండవలెననే ఉద్ధేశ్యంతో ఇటువంటి సామూహిక భజనలు ఏర్పాటు చేసి ఉండవచ్చుననుటలో అతిశయోక్తి కనబడుట లేదు. సంక్రాంతి పండుగ నెలరోజుల ముందు ధనుర్మాస సందర్భంగా ఆంధ్రప్రాంతంలోని ప్రతి ఇంటిముందు రకరకాలైన ముగ్గులువేసి గోమయంతో చేయబడిన గొబ్బెమ్మలను ఈ ముగ్గుల మధ్య అమర్చి, ఆ



గొబ్బెమ్మకు పసుపు, కుంకుమ, పూలు జల్లి గొబ్బెమ్మ మధ్యలో ఒక గుమ్మడిపూవును పెట్టెదరు. ముగ్గువేయుటలో ఆడపిల్లలు పోటీపడి ఇంటిముందున్న వీధంతా రంగురంగుల ముగ్గులతో నింపి ఆ వీధికి తివాసీ వేసినంత భ్రాంతికలిగిస్తారు. సంపదలకు అధిదేవతైన శ్రీ లక్ష్మీ అమ్మవారిని ఆహ్వానించునట్లుగా చెప్పబడే ఆ ముగ్గుల కళ నిలపుటకై కొన్ని సంస్థలవారు గ్రామాలలో ముగ్గులపోటీలు నిర్వహించి గెలిచిన వారికి బహుమతులు ఇచ్చుచున్నారు. గొబ్బెమ్మలను ఇంటిముందు ముగ్గులో ఒకపద్ధతిలో అమర్చి నవధాన్యాలతో పూజచేసి హారతిచ్చి ఆడపిల్లలందరూ శ్రీ లక్ష్మీదేవిని, శ్రీ పార్వతీ

అమ్మవారిని కీర్తిస్తూ చప్పట్లుకొడుతూ పాటలు పాడుతూ గొబ్బెమ్మలచుట్టూ వృత్తాకారంలో నృత్యం చేస్తారు. ఆరోజు సాయంత్రానికి గొబ్బెమ్మలను గోడలకు కొట్టి ఎండపెట్టెదరు. సంక్రాంతి పండుగ రోజున ఊరిచుట్టుప్రక్కల స్త్రీలను పిలచి ఆ రోజుపెట్టిన గొబ్బెమ్మల చుట్టూ నృత్యం చేసి, ప్రసాదాన్ని పిడకలపై వండి ఆ ప్రసాదాన్ని స్త్రీలందరికీ భక్తిభావంతో పంచెదరు. గొబ్బెమ్మ అనుపదం "గోపెమ్మ" (అనగా శ్రీ కృష్ణుని ప్రియరాలు) నుండి ఆవిర్భవించింది. ఈ విషయం తమిళభాషలో రచించబడిన "తిరుప్పావై" అను వైష్ణవ గ్రంథంలోను, తెలుగు కవులయిన అన్నమయ్య మొదలయిన కవుల సాహిత్యంలోను విశదీకరించబడింది.

ఇంకొక కథ ఏమనగా పూర్వపురోజులలో రేపల్లెలోని గోపికా స్త్రీలు కరువుపోయి వర్షాలు వచ్చి పంటలు పండవలెను మరియు మంచి భర్తరావలెనని కాత్యాయిని పూజలు చేసినారు. వారి భక్తికి మెచ్చి కాత్యాయినీ అమ్మవారు మంచి వర్షాలు యిచ్చి పంటలు పండునట్లు చేయుట మరియు మంచి భర్త అనగా శ్రీకృష్ణుని గోపికలను యిచ్చుట మూలంగా గోపికలుకు కోర్కె నెరవేరిందని చెబుతారు.

అందువలన కుటుంబ క్షేమం మరియు సుఖ సంతోషాల కొరకు ఆడపిల్లలు గొబ్బెమ్మలను పెట్టి, పంటలు వచ్చే రోజులలో అమ్మవారిని స్తుతిస్తూ భజనలను చేస్తూ నృత్యాలు చేస్తూ సంతోషంగా పాటలుపాడతారు. ఈ జక్కిభజనను ప్రత్యేక వాద్యాలు లేవు. కేవలం లయబద్ధంగా పాటకు తగినట్లుగా చప్పట్లుచరుస్తూ నృత్యం చేస్తూ పాడతారు. ప్రత్యేకంగా పంటపండిన సందర్భంగా సంతోషంతో అమ్మవారికి కృతజ్ఞతలు తెలుపుచూ, సంపదను కోరుచూ, కుటుంబ సౌభాగ్యం కొరకు గొబ్బెమ్మలను పెట్టి భజనచేస్తారు. ఈ భజన్ల చేయుటకు వివిధ రకముల రంగురంగు ముగ్గులను వేసి దానిలో గొబ్బెమ్మలను పెట్టుటవలన గ్రామజీవనం క్రొత్తరూపం వచ్చి గ్రామస్థులందరికి ఎంతో ఉత్సాహం కలిగిస్తుంది.